క్లుప్తంగా

నేడు లూయిస్ బ్రెయిలీ విగ్రహావిష్కరణ



మంత్రులు ప్రారంభించనున్న విగ్రహం

చాదర్‌ఘాట్: లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా నల్గొండ క్రాస్‌రోడ్స్‌లోని జాతీయ వికలాంగుల పార్కులో బుధవారం బ్రెయిలీ కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులచే బుధవారం ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, తొమ్మిది అడుగుల ఎత్తులో రూ. 27 లక్షలతో సిద్ధం చేసిన లూయిస్ బ్రెయిలీ కాంస్య విగ్రహాన్ని మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్‌లు ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ షఫీ అహ్మద్ పాల్గొంటారని తెలిపారు. అందరూ పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

8న సహకార భారతి ఆవిర్భావ దినోత్సవం

సైదాబాద్: సహకార భారతి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈనెల 8న సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహిస్తామని సరస్వతి పొదుపు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ స్టాల్ నిర్వహిస్తామన్నారు. అదే విధంగా ఆ రోజు ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు.

నాలా పనులను పూర్తి చేయండి

భిక్షాటన చేసి నిరసన తెలిపిన బీజేపీ



భిక్షాటన చేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: నిధులు లేక అర్థాంతరంగా ఆగిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులు వెంటనే మొదలు పెట్టాలని మంగళవారం బీజేపీ నాయకులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బీజేవైఎం బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది 1, 22, 23, 29వ డివిజన్‌లో వరద నీటి ముంపు నుంచి విముక్తి కల్పించేందుకు ట్రంక్ లైన్ (ఎస్ఎన్‌డీపీ) పనులు మొదలు పెట్టి మధ్యలోనే నిలిపివేశారని తెలిపారు. పనులు ఆగి ఏడాది కావస్తున్నా ప్రారంభించడం లేదని మండిపడ్డారు. వెంటనే పనులు మొదలు పెట్టాలని, లేకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కో కన్వీనర్ నడికుడ యాదగిరి, చంద్రపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వెంకన్నకు గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం సోమవారం రాత్రి గోవింద నామస్మరణతో మారుమోగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామివారు గరుడ వాహనంపై సేదతీరి పుర విహారం చేశారు. వాహన సేవలో మహిళలు పోటీ పడ్డారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్, దాతలు దామోదర్ సచిన్ సోని, ఎడ్ల వాసుదేవారెడ్డి, రవి ప్రసాద్, ,గ్రామస్థులు నందీశ్వర్, గణేష్ గౌడ్ , సురేష్ గౌడ్, సుదర్శన్ తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

డీజీపీకి శుభాకాంక్షలు

మన్సూరాబాద్: నాలుగుసార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన సామాజిక కార్యకర్త, రచయిత, కళాకారుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లకు బదులుగా వినియోగించాలని కోరుతూ గుడ్డ సంచిని అందజేశారు.



డీజీపీకి క్లాత్ సంచిని అందజేస్తున్న కృష్ణకుమార్

మహిళా చైతన్య దీప్తి సావిత్రిబాయి

ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ బృందం: విద్య ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమని మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు ముందుకు వచ్చి, స్త్రీల హక్కుల కోసం పోరాడిన వీరవనిత, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నాగోలులో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు

◆ నాగోలు సాయినగర్‌లో మన రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ చింతల అరుణ, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి పాల్గొని సావిత్రి భాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు తోట మహేష్ యాదవ్, సిద్దాల అరవింద్ కుమార్, బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, నరేందర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: అంబేడ్కర్ సంఘం నాయకులు పొరండ స్వామి, ఎర్ర రవీందర్‌ల ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి హాజరై సావిత్రీభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మన్సూరాబాద్: సహారా రోడ్డులోని సావిత్రి బాయి పూలే విగ్రహానికి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, సోషల్ జస్టిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చామకూర రాజు, సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, బీసీ సంఘం నేత ముద్దగౌని సతీష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలక్‌పేట: బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవేందర్‌లు సావిత్రి బాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ అక్బర్‌బాగ్ డివిజన్ చౌరస్తాలో బీజేపీ నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా ప్రతినిధి లింగాల హరిగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తదితరులు



హయత్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



మూసారంబాగ్‌లో .. నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: బీజేపీ

మన్సూరాబాద్: అభివృద్ధి పనుల కోసం కాలనీవాసులు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు చేపట్టాలని బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ డిమాండ్ చేశారు. డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీ రోడ్ నెంబర్–7లో జీహెచ్ఎంసీ నిధులతో షటిల్‌కోర్టును అభివృద్ధి చేశారు. కాలనీవాసులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేరుతో శిలాఫలకం మంగళవారం ఉదయం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ బీజేపీ నేతలు శిలాఫలకం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రామేశ్వర్ మాట్లాడుతూ, కాలనీవాసులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ప్రశాంతంగా ఉండే కాలనీలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనేలా బీఆర్ఎస్ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. స్థానికులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు.



ధ్వంసం చేసిన శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

నాడు ఒప్పు... నేడు తప్పా..

ఆర్.కృష్ణయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇదే బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడితో కాలనీవాసులు అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ పేరు లేకుండా శిలాఫలకం ఏర్పాటు చేశారని, నాడు ఒప్పయింది... నేడు తప్పెలా అవుతుందని బీజేపీ నేతలు ప్రశ్నించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఎంజాల జగన్, గంగదాసు కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సిద్దు, శివ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ప్రమాదాలకు బలి కావొద్దు

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 236 మందికి కౌన్సెలింగ్



మద్యం తాగి పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్

నాగోలు: ''మద్యం తాగి వాహనాలు నడపకండి.. ప్రమాదాలకు కారణం కాకండి.. కొత్త సంవత్సరంలో గట్టి నిర్ణయం తీసుకోండి''.. అని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ సూచించారు. రాచకొండ పరిధిలో న్యూ ఇయర్ రోజున చేపట్టిన వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 236 మందికి మంగళవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ వద్ద ఉన్న టీటీఐలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు డీడీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం నిబంధనలకు విరుద్ధమన్నారు. మద్యం తాగి వాహనాలు పడిపే వారు ప్రమాదాల బారిన పడితే వారి కుటుంబం రోడ్డు పాలయ్యే దుస్థితి ఎదురవుతుందని గుర్తు చేశారు. కుటుంబ సభ్యుల సంక్షేమ కోరే వారు మద్యం తాగి వాహనాలు నడపరన్నారు. తాగి వాహనం పడిపే వారు ప్రమాదాలకు కారణమై ఏ మాత్రం సంబంధం లేని వారి జీవితాల్లోనూ విషాదం నింపుతారన్నారు. మద్యం తాగి వాహనాలు నడపమని కొత్త సంవత్సరంలో గట్టి నిర్ణయం తీసుకోవాలన్నారు. టీటీఐ ఎస్ఓపీ ఆల్లూరయ్య, సిబ్బంది రమేష్ ప్రముఖుల సందేశాలను, సందేశాత్మక గీతాలనూ, రోడ్డు ప్రమాదాల దృశ్యాలనూ, సీసీ పుటేజీల్లో నమోదైన వాహనాలు నడిపే తీరునూ ప్రదర్శించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్ పెట్టుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఎఫ్‌టీఎల్ సమస్య పరిష్కారానికి కృషి



కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాలనీ వాసులు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలోని ఎఫ్‌టీఎల్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గ్రీన్ పార్క్ కాలనీ వాటర్ బెల్ట్ సమస్యపై మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రతిక్ జైన్లతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఈ సమస్యపై కలెక్టర్‌ను కలవగా ఈ విషయాన్ని పరిశీలించాలని జాయింట్ కలెక్టర్‌కు చెప్పారని అన్నారు. మరోసారి కాలనీ వాసులతో పాటు కలెక్టర్‌తో సమావేశమై సమస్య తీవ్రతను వివరించామన్నారు. 2008లో గ్రీన్ పార్క్ కాలనీని వాటర్ బెల్ట్‌గా గుర్తిస్తూ జీఓ తీసుకొచ్చారని, దీంతో వాటర్ బెల్ట్, బఫర్ జోన్‌తో పాటు వాటికి బయట ఉన్న స్థలాలకు కూడా అనుమతులు రావడం లేదని తెలిపారు. ఎఫ్‌టీఎల్ కారణంగా 800 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, రీసర్వే చేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యేను కోరారు. కలెక్టర్ సూచన మేరకు వాటర్ బెల్ట్ జీఓను ఉపసంహరించేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని సుధీర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు, కాలనీ వాసులు కమలేష్ రెడ్డి, బాల్‌రెడ్డి, రామయ్య , మహిపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీదేవి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తిలక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాను అడ్డుకోండి

నాగోలు: కొత్తపేట గ్రామంలో సర్వే నెంబర్ 143లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 5 గుంటల భూమిని కొంత మంది ఆక్రమించుకున్నా ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని శ్రీనాగేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నదని ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కొంత మంది మండల అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చైర్మన్‌కు శుభాకాంక్షలు



వాసుదేవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

చాదర్‌ఘాట్: వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ, జీఎం ప్రభంజన్‌రావులకు సంస్థ ఉద్యోగులు నూతన సంవత్స శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మలక్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఉద్యోగులు వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు సంపత్‌కుమార్, కె.రాములు, ఎస్.రాములు పాల్గొన్నారు.

'వెలమ' సభను విజయవంతం చేయండి

చాదర్‌ఘాట్: నల్గొండలో ఈనెల 8న జరిగే అఖిల భారత వెలమ సంఘం అభినందన సభను విజయవంతం చేయాలని ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కార్యదర్శి పొనుగోటి చొక్కారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మలక్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అఖిల భారత వెలమ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కణ్మనేని పాపారావుకు అభినందన సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డ్యాబ్ సంస్థ కోశాధికారి పరమేష్, సంఘం మహిళా కార్యవర్గ సభ్యులు గోమతి శాంత పాల్గొన్నారు.

దుర్వాసన రాకుండా రసాయనాల పిచికారీ

మన్సూరాబాద్: ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో వస్తున్న దుర్వాసనకు త్వరలోనే చెక్ పెడతామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ ప్రాంతంలోని అటవీశాఖ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిలో డ్రోన్ల సహాయంతో దుర్వాసన రాకుండా రసాయనాలను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా కెమికల్ వ్యర్థాల దుర్వాసనతో సమీప కాలనీలవాసుల ఇళ్లలో ఉండలేక పోతున్నారన్నారు. వివిధ శాఖల అధికారులకు సమస్య తీవ్రతను వివరించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

మలక్‌పేట: ప్రజల రక్షణే ట్రాఫిక్ పోలీసుల ప్రధానోద్దేశమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మూసారంబాగ్ శ్రీచైతన్య స్కూల్లో మంగళవారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'ట్రాఫిక్ సేఫ్టీ నిబంధనల'పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి పోలీసులకు పట్టుబడితే కౌన్సిలింగ్ ఇస్తారని, అదే యముడికి దొరికితే ప్రాణాలకే ముప్పు అని, అందుకే వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండటం మంచిదన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ గిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

పార్కు స్థలం కబ్జాకు యత్నం.. అడ్డుకున్న కార్పొరేటర్



హైవే కాలనీ లే- అవుట్‌ను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్ఎంసీ ప్రహరీ నిర్మించిన పార్కు స్థలం తనదంటూ ఓ వ్యక్తి కబ్జాకు యత్నించగా, టౌన్‌ప్లానింగ్ అధికారుల సాయంతో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అడ్డుకున్నారు. వివరాలు... మన్సూరాబాద్ డివిజన్ పరిధి గ్రామ సర్వే నెంబర్ 56/1 హైవే కాలనీలో సుమారు 400 గజాల స్థలం పార్కుకు కేటాయించారు. ఈ స్థలం చుట్టూ జీహెచ్ఎంసీ ప్రహరీ నిర్మించింది. ఈ స్థలం తనదంటూ ఓ న్యాయవాది గేటుకు తాళం వేయడంతో పాటు స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నాయని బ్యానర్ కూడా కట్టాడు. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల సాయంతో కార్పొరేటర్ గేటు తాళం తీయించి బ్యానర్‌ను తొలగించి స్థలం కబ్జా కాకుండా అడ్డుకున్నాడు.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు చేపట్టాలి

గతంలో ఈ స్థలంలో పెద్ద బావి ఉండేదని, దాన్ని పూడ్చి పార్కుగా అభివృద్ధి చేశామని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా పార్కుగా ఉన్న స్థలం నేడు ప్రైవేట్ ఎలా అయ్యిందని ప్రశ్నించారు. మన్సూరాబాద్ డివిజన్‌లో పలు పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రహరీలు నిర్మించిన పార్కు స్థలాలకే రక్షణ లేకుంటే, ప్రహరీలు లేని స్థలాలను అధికారులు ఎలా రక్షిస్తారని మండిపడ్డారు. ఇంటి నెంబర్, బై నెంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పసుపు, కుంకుమ అందజేత

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో ×ఉందుమదగళిత్తి× పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, మహిళలు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. సౌభాగ్యవతులకు ఆండాళ్ నిలయం వారు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణ ఉన్నారు.



కార్పొరేటర్ భాగ్యలక్ష్మికి పసుపు, కుంకుమ అందజేస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యేను కలిసిన వైదేహీనగర్ వాసులు

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహీ నగర్ నార్త్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ 2023 కేలండర్‌ను ఎమ్మెల్యేచే ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ వాసులు వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, నాగరాజు, విద్యాసాగర్, కోటేశ్వరయ్య, రామ్మోహన్, రామిరెడ్డి, ప్రసాద్, లక్ష్మణ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

'అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకున్నందుకే ఆరోపణలు'

సైదాబాద్: సింగరేణి కాలనీలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకున్నందుకే ఇందూ అనే మహిళ పలువురు నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నదని అఖిలపక్ష నాయకులు తెలిపారు. మంగళవారం సింగరేణికాలనీ రోడ్ నెం:7లోని హనుమాన్ ఆలయంలో గుడిసెవాసులతో కలిసి అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుడిసెవాసులు అందరూ కలిసి రాజకీయ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ఇక్కడ హనుమాన్ ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ స్థలంలో కొంత భాగం తనకు ఇవ్వాలని ఇందూ అడిగితే నిరాకరించినందుకు తమను బ్లాక్‌మెయిల్ చేస్తుందని ఆరోపించారు. ఆమెను పార్టీ మారమని ఎవ్వరూ అడుగలేదని వారు స్పష్టం చేశారు. సైదాబాద్ పోలీసులు ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ఎవరి తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సక్రిబాయ్, షేక్ మహమూద్, గజానంద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ గుడిలో సమావేశమైన అఖిలపక్ష నాయకులు

సిబ్బంది ఆందోళనతో మెట్రో ప్రయాణికుల ఇక్కట్లు



దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్‌లో టికెట్ కోసం క్యూలో నిల్చున్న ప్రయాణికులు

చైతన్యపురి: మెట్రో స్టేషన్ టికెట్ కౌంటర్ ఉద్యోగులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టడంతో ఎల్‌బీనగర్, చైత్యపురి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట పరిధిలోని మెట్రో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రత్యామ్నాయంగా టికెట్ బుకింగ్ కౌంటర్ సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ టికెట్ జారీలో ఆలస్యం కావడంతో కౌంటర్ల వద్ద ప్రయాణికులు బారులుతీరారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా కొందరు స్వయంగా టికెట్ బుక్ చేసుకున్నారు. క్యూలైన్లలో టికెట్ తీసుకొనేందుకు దాదాపు పది నిమిషాలు పట్టిందని, దీంతో గమ్య స్థానాలకు చేరుకోవటానికి ఆలస్యమైందని పలువురు ప్రయాణికులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

నాగోలు: కొత్తపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రముఖ సంఘ సేవకుడు మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా గురుస్వామి మంగళవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్‌రావు, ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ నాయకుడు వజీర్ ప్రకాష్‌గౌడ్ , అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా తదితరులు